క్లుప్తంగా

వధూవరులకు ఆశీస్సులు



కోడూరు: కోడూరు వైస్ ఎంపీపీ చేబోయిన లీలావతి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు చేబోయిన లీలాకృష్ణ కుమారుడు నాగకిరణ్–భాగ్య శశికళ వివాహ వేడుకల్లో ఆ పార్టీ అవనిగడ్డ, మచిలీపట్నం సమన్వయకర్తలు సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. మండలంలోని ఊటగుండం గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీలు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

మచిలీపట్నంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యాన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం స్థానిక డాక్టర్ పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో గురువారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ స్థాపకుడు సర్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చలివేంద్రం ప్రారంభం, మజ్జిగ పంపిణీ, పేదలకు వస్త్రాలు, పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ హాల్లో డాక్టర్ తోట వీరేంద్రనాథ్ యోగా సభ్యులకు ఆపద సమయంలో ప్రాణ రక్షణపై (సీపీఆర్) అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రెజరర్ కొండపల్లి రామ్ బాలాజీ, స్టేట్ ఎంసీ మెంబర్ కొత్తగుండు రమేష్, ఎంసీ మెంబర్లు మాధవి, లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేడు కళావేదిక ప్రారంభం

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో దాతల సౌజన్యం రూ.9లక్షల వ్యయ అంచనాతో నిర్మించిన కళావేదికను శుక్రవారం రాత్రి 7.15గంటలకు ప్రారంభిస్తున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు గురువారం తెలిపారు. భోగాది రాధాకృష్ణ ప్రోత్సాహంతో మెండు శివరామప్రసాద్– కమలకుమారి, భోగాది రమణరావు(రమణ)–రాజేశ్వరి, అలపర్తి సాంబశివరావు–కమలకుమారి దంపతులు ఆర్థిక సౌజన్యం సమకూర్చినట్లు ఆయన చెప్పారు.

కృష్ణా వర్సిటీ సహాయ ఆచార్యులు జ్ఞానేశ్వరికి డాక్టరేట్

రుద్రవరం (మచిలీపట్నం రూరల్): కృష్ణా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిపై కేయూ మేనేజ్‌మెంట్ విభాగంలో సహాయ ఆచార్యులు పెడసనగంటి జ్ఞానేశ్వరికి డాక్టరేట్ రావడం అభినందనీయమని వీసీ రాంజీ అన్నారు. గృహ ఆర్థిక, పెట్టుబడి నిర్ణయాలపై నమూనాల్లో వైవిధ్యాన్ని కొలిచే అధ్యయనంపై జ్ఞానేశ్వరి చేసిన పరిశోధన ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీలో ఆచార్యులు ఎస్.రజిని పర్యవేక్షణలో ప్రదర్శించగా జ్ఞానేశ్వరికి గౌరవ డాక్టరేట్ డిగ్రీ వచ్చిందన్నారు.

విద్యార్థినికి సత్కారం

శ్రీకాకుళం(ఘంటసాల): పది ఫలితాల్లో ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కోడి సౌమ్యశ్రీ 565 మార్కులతో స్కూల్ మొదటి స్థానం, మండలస్థాయిలో ద్వితీయ స్థానం పొందిన సందర్భంగా నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ చేతుల మీదగా విద్యార్థిని సౌమ్యశ్రీని శాలువాతో సత్కరించి నగదు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల సత్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): రెడ్‌క్రాస్ ద్వారా విశిష్ట సేవలు అందించినందుకు కలెక్టర్ డీకే బాలాజీ.. గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న నేపథ్యంలో కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగులు ఆయనను గురువారం రాత్రి ఘనంగా సత్కరించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జరిగిన సత్కారంలో ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

తాము ఎటువంటి నిరసనలు చేపట్టలేదు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లా బందరులో ఈ నెల 6న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ మానవహారం, నిరసన ప్రదర్శన చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ వారు చేసిన ఆందోళనల్లో తాము పాల్గొనలేదని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పి.దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమకు ఆ కార్యక్రమానికి సంబంధం లేదని పేర్కొన్నారు.

పోలీసుల తీరు దుర్మార్గం

- 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి గృహంపై పోలీసుల దాడిని ఖండిస్తూ దివిసీమ జర్నలిస్టుల నిరసన ర్యాలీ
- పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పెడన, అవనిగడ్డలో వినతిపత్రాలు అందజేత



అవనిగడ్డలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



అవనిగడ్డ వంతెన సెంటర్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

అవనిగడ్డ: పోలీసుల తీరు దుర్మార్గమని.. పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని పలు పాత్రికేయ సంఘాల నేతలు, జర్నలిస్టులు అన్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా విజయవాడలో 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి గృహంలో పోలీసులు నిర్బంధ సోదాలను నిరసిస్తూ దివిసీమ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అవనిగడ్డ వంతెన సెంటర్‌లో గురువారం నిరసన ర్యాలీ చేశారు. జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకుని స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ప్రదర్శన చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, పోలీసులు సోదాలను ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) సభ్యుడు పెరవలి రవి మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాస్తున్నందుకు 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో నిర్బంధ సోదాలు నిర్వహించడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కక్ష సాధింపు సరికాదు

సీనియర్ జర్నలిస్ట్ దోవా గోవర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసేవారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడం ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు. ప్రజల గొంతుకై ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తించడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే అని చెప్పారు. కార్యక్రమంలో అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అప్పికట్ల శ్రీనివాసరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుట్టి శ్రీనివాసరావు, మోపిదేవి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టులు కోట సుబ్బారావు, కోట యూరీ గగారిన్, అలపర్తి గోపాలకృష్ణ, ఉప్పాల సుబ్బారావు, ఆకురాతి ప్రసాద్, ఆకుల సుధీర్‌కుమార్, కొండవీటి సురేష్, చిట్టిప్రోలు కేశవ్ కుమార్, జరుగు శ్రీనివాసరావు, చందు శ్రీనివాసరావు, విష్ణుబొట్ల శ్రీనివాసరావు, సామర్లపల్లి లక్ష్మణరావు, రిమ్మనపూడి విజయ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

పెడనలో

పెడన: 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డిపై పోలీసుల ప్రవర్తన అమానుషమని, ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం ఆర్డీవో స్వాతికి పెడన ప్రెస్ క్లబ్ సభ్యులు గురువారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. పెడన తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ముగించుకుని బయల్దేరుతున్న ఆర్డీవోను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వై.సుబ్రహ్మణ్యం, మాజీ అధ్యక్షుడు ఎన్.గంగాధరరావు, ఇతర సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ, వార్తలను రాయకుండా ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న వారిని పనిచేయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు టి.సత్యనారాయణ, జి.సురేష్, పి.కోటయ్య, ఆర్.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో స్వాతికి వినతి పత్రం అందజేస్తున్న పెడన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తదితరులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గూడూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ మచిలీపట్నం సీడీపీఓ కె.గ్లోరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొట్లేలుగుంటాయిపేట మినీ అంగన్‌వాడీ కార్యకర్త, కప్పలదొడ్డి-2, కంకటావ-1, కంకటావ-2, చిట్టిగూడూరు, ఆకుమర్రు-1 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె వెల్లడించారు. అర్హులైన ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 17లోగా మచిలీపట్నంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు.

- **కృత్తివెన్ను:** అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త కోసం కృత్తివెన్ను దళితవాడ ఎస్సీ రిజర్వేషన్, సహాయకురాలికి ఏటిపవర్ (బీసీ ఎ), లక్ష్మీపురం లాకు (ఓసీ), చినగొల్లపాలెం (ఓసీ), మాట్లాం ఎస్ నగర్ (ఓసీ) రిజర్వేషన్ల సంబంధించిన వివాహిత మహిళలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం లోపు బంటుమిల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

ఘనంగా మాధవస్వామి బ్రహ్మోత్సవాలు

గూడూరు: గూడూరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గురువారం సాయంత్రం స్వామివారిని పెళ్లి కుమారుడిని, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సమ్మె విజయవంతం చేద్దాం

మచిలీపట్నంటౌన్: కార్మిక వర్గాల ప్రయోజనాల కోసం ఈ నెల 20వ తేదీ చేయనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి కృషి చేద్దామని పలు కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక బుట్టాయిపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్మికులకు నెలవారి కనీస వేతనం 26 వేల రూపాయలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మిక ప్రయోజనకర చట్టాలను కొనసాగించాలన్నారు. సంఘ నగర కార్యదర్శి చిరువోలు జయరావు, ఇన్సూరెన్స్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నేత చంద్రపాల్, ఆల్ ఇండియా బ్యాంకింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోశాధికారి పూస ఉదయ్ కుమార్, మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎర్రం శెట్టి ఈశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు ఒంటి పులి లక్ష్మణరావు మాట్లాడారు. మెడికల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మదిరి ఫణీంద్ర, ఐఎన్‌టీయూసీ యూనియన్ నేత షేక్ ఆయుబ్, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ సంఘ నేత మహమ్మద్ యూనస్ పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

సమ్మె నోటీస్ అందజేత

సార్వత్రిక సమ్మె నోటీసును మున్సిపల్ కార్మికులు సంఘ నేతలతో కలిసి కమిషనర్ బాపిరాజుకు అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఈశ్వరరావు, సీహెచ్ బుల్లెమ్మ, వై.విజయ తదితరులు ఉన్నారు.

నెలలో రెండు రోజులు సమాజసేవ చేయాలి

మచిలీపట్నంరూరల్: నెలలో కనీసం రెండు రోజులైనా సమాజానికి సేవ చేయాలని కేయూ వీసీ కె.రాంజీ అన్నారు. కృష్ణ యూనివర్సిటీలో గురువారం జాతీయ మారి టైం దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా వీసీ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు, అధ్యాపకులు నెలలో రెండు రోజులు పూర్తిగా సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మన సముద్రం, మన అవకాశాలు, మన హక్కులు అనే అంశంపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ అనే సంస్థలతో కలిసి కృష్ణా విశ్వవిద్యాలయం నిర్వహించిన గూగుల్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. నావెల్ అకాడమీ కేయూ చేసుకున్న ఒప్పందంలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రెండు నూతన కోర్సులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐఈఐ ఏపీఎస్సీ చైర్మన్ ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్ మాట్లాడుతూ రాష్ట్రానికి సుదీర్ఘ తీర ప్రాంతం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం అనేక ప్రణాళికలను రూపొంచడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో మజ్గిగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్ చందుసాంబ శివరావు, ఐఈఐ ఏపీఎస్సీ కార్యదర్శి ఆచార్య నరేష్ బాబు, గూగుల్ మీట్‌లో ఇండియన్ నేవీ కమాండర్ ఆదేశ్ పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాంజీ

ఘనంగా కల్యాణ మహోత్సవాలు

భావదేవరపల్లి(నాగాయలంక): అత్యంత ప్రాచీన చారిత్రిక ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు గురువారం ఉదయం స్వామివారిని పెళ్లి కుమారుడు, అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా ముస్తాబు చేసారు. వంశపారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు పంచాంగం రమణాచార్యులు, శ్రీనివాసాచార్యులు పంచాంగం కుటుంబ సభ్యుల బ్రహ్మత్వంలో పూజాదికాలు చేశారు. అనంతరం మొదటిరోజు సంప్రదాయం ప్రకారం విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధం, రుత్విగ్వరణం, మృత్యంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అర్చకుడు రమణాచార్యులు మాట్లాడుతూ శుక్రవారం హోమాలు, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, శనివారం రోజున నిత్యహోమం, జగజ్యోతి, 11వతేదీ రాత్రి ఎదుర్కోలు వేడుక, కళ్యాణ మహోత్సవం జరుగుతాయని వివరించారు.

హోం గార్డుకు కంట్రిబ్యూషన్ చెక్కు

కోనేరుసెంటర్: సుదీర్ఘకాలం హోంగార్డుగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన వెంకటేశ్వరరావు శేషజీవితాన్ని సంతోషంగా గడపాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. కృష్ణా జిల్లా హోం గార్డు విభాగంలో హోం గార్డుగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఎంఈ వెంకటేశ్వరరావుకు జిల్లాలోని హోంగార్డులంతా కలిసి సేకరించిన వన్‌డే కంట్రిబ్యూషన్ రూ.3,86,240 చెక్కును గురువారం ఎస్పీ తన కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందినా పోలీసు సేవలను హోం గార్డులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు, ఆర్ఐలు సతీష్‌కుమార్, రవి కుమార్ పాల్గొన్నారు.



హోం గార్డుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ గంగాధరరావు

పులిగడ్డ సర్పంచ్‌కి సత్కారం

అవనిగడ్డ: పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఇటీవల డాక్టరేట్ తీసుకున్న పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్‌ని హైల్ప్ హ్యాండ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి లీలాకృష్ణ సర్పంచ్ విజయ్‌కుమార్‌కు శాలువా కప్పి పూలమాల వేశారు. సొసైటీ సభ్యులు కోడూరు బాబూ రాజేంద్రప్రసాద్, అన్నపరెడ్డి కృష్ణ, బండే శ్రీనివాసరావు, నీలకంఠం రామ్మోహనరావు, మోపిదేవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం

కోడూరు: వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ లక్ష్మీగణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఉల్లిపాలెంవైపు ఉన్న సిద్ధిబుద్ధి సమేత ప్రసన్న గణపతి దేవాలయ సప్తమ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మూలమూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద లక్ష్మీగణపతి హోమం జరిపారు. ఉభయ దాతలు కోడూరుకు చెందిన కంచర్లపల్లి లీలాశ్రీనివాస్–నాగలక్ష్మి దంపతులు హోమాన్ని నిర్వహించారు. హోమం అనంతరం మహాపూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఘంటసాల: ఘంటసాలలో ఈ నెల 12న జరిగే బుద్ధ జయంతి ఉత్సవాల ఏర్పాట్లు, ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన పారిశుద్ధ్య చర్యలను ఎంపీడీవో డి.సుబ్బారావు గురువారం పరిశీలించారు. బౌద్ధ స్తూపం, మ్యూజియం పరిసరాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులపై ఈవో జయలక్ష్మికి పలు సూచనలు చేశారు. ఘంటసాల అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన వాటర్ ట్యాంకును ఆర్ డబ్ల్యూఎస్ ఏఈఈ సుగుణ కుమారితో కలసి పరిశీలించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

కృత్తివెన్ను: చినగొల్లపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ గురువారం ఆలయాన్ని సందర్శించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

చిన్నకరగ్రహారం (మచిలీపట్నం రూరల్): దేవాలయం నిర్మాణ భూమి పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొని భూమి పూజ చేశారు. చిన్న కరగ్రారం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో గురువారం గ్రామస్తుల విరాళాలు రూ.30 లక్షలతో రామాలయం నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జిలు రామాని గంగరాజు, సత్తినేని సురేంద్ర, పార్టీ నాయకులు వన్నెం రెడ్డి విజయ్ కుమార్, లంకె వెంకటేశ్వరరావు, పెనుబోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ పేరుతో కాలయాపన తగదు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): జేఎల్ఎం గ్రేడ్–2ల విషయంలో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వహిస్తోందని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్–5 రాష్ట్ర కోశాధికారి హేమకుమార్ విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ నియామకాల్లో తమతో పాటు నియమించిన మిగతా ఉద్యోగులకు వారి మాతృశాఖ నూతన సర్వీస్ రూల్స్ ఇవ్వలేదని, కేవలం విద్యుత్‌శాఖ మాత్రమే ఇలా చేయడం అన్యాయమన్నారు. పాత సర్వీస్ రూల్స్ అనుసరించి ప్రమోషన్ ఇవ్వాలని, కమిటీలు వేసి కాల యాపన చేయడం తగదని, ఉద్యోగుల్లో ఇప్పటికే తీవ్ర అసంతృప్తి ఉందని, అది వ్యతిరేకంగా మారకముందే యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బదిలీల విషయంలో ఈపీడీసీఎల్ డిస్కమ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా ఎలాంటి అవినీతికి చోటు లేకుండా బదిలీలు జరపాలని కోరారు. నూతన సర్వీస్ రూల్స్‌కు తాము పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు.

ఐనంపూడి డ్రెయిన్ కిక్కిస తొలగింపు పనులు వేగవంతం చేయాలి

ఘంటసాల: ఐనంపూడి డ్రెయిన్ కిక్కిస తొలగింపు పనులు వేగవంతం చేయాలని గుడివాడ డివిజన్ డ్రైనేజి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కిరణ్ బాబు అన్నారు. ఘంటసాల మండలం మల్లాయి చిట్టూరు పరిధిలోని ఐనంపూడి డ్రెయిన్‌లో రూ.16 లక్షలతో జరుగుతున్న కిక్కిస తొలగింపు పనులను ఈఈ కిరణ్ బాబు గురువారం పరిశీలించారు. డ్రెయినేజీ శాఖ ఏఈఈ ఎం.భగవతి, నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల ధర్మవెంకట నరసయ్య పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

బంటుమిల్లి: నూతన రేషన్ కార్డులు, నివేసన స్థలాల కోసం అర్జీలు ఇచ్చే లబ్ధిదారులు దళారులపాలు కాకుండ గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం పాలనలో వలంటీర్లు ఉండి ఇలాంటి పథకాలు లబ్ధిదారులకు అందడానికి కృషి చేశారని ఇప్పుడు అలాంటి వ్యవస్థ లేకపోవడంతో లబ్ధిదారులు దళారులపాలపడి ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని నాయకులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నేతలు ఎం.శ్రీనివాసరావు, బి.నాగరాజు, పి. వెంకన్న, ఎల్.అజయ్‌ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనంతో వృద్ధురాలి బలవన్మరణం

బంటుమిల్లి: పెందుర్రు గ్రామానికి చెందిన పాలపర్తి విజయలక్ష్మి (జయమ్మ, 70) వృద్ధాప్యంలో ఒంటరితనంతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడింది. గురువారం ఉదయం స్థానిక రజకుల చెరువు వద్ద సూసైడ్ నోటు రాసి అందులో 'నా గురించి మీరు ఇబ్బందులు పడవద్దని మీ సంసారాలు మంచిగా చూసుకోండని నేను చెరువు వద్దకు వెళుతున్నాను' అని ఉంది. ఈ క్రమంలో ఉదయం 8 గంటల సమయంలో చెరువు వద్దకు వెళ్లిన స్థానికులకు ఈ సూసైడ్‌నోట్ కనిపించింది. ఆ వెంటనే గ్రామస్తులకు, స్థానిక బంధువులకు కబురు చేసి చెరువు వద్ద పరిశీలించగా కొద్ది సేపటికి మృతదేహం పైకి తేలింది. ఈ నెల 1వ తేదీ పింఛన్ కోసం వచ్చిన మృతురాలు ఇన్ని రోజులుగా గ్రామంలోనే ఉంటోంది. గ్రామంలో సొంత ఇల్లు, స్థలం ఉన్నాయి. మృతురాలికి ముగ్గురు ఆడపిల్లలు. వారిలో ఇద్దరు విజయవాడలో, ఒకరు ముదినేపల్లి మండలం ఈడేపల్లిలో నివసిస్తుంటారు. విజయలక్ష్మి ఇక్కడే ఉంటూ అప్పుడప్పుడు కుమార్తెల వద్దకు వస్తూ ఉంటుంది. ఈ స్థితిలో ఆమె బలవన్మరణానికి ప్రయత్నించడానికి కారణాలను స్థానికులు చెప్పలేకపోతున్నారు. ఒంటరితనం.. మనవడి మరణ మనోవేదన ఆమె మృతికి కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఆమె భర్త నాంచారయ్య కరోనా కారణంగా మరణించి దాదాపు 5 ఏళ్లు అవుతోంది. ఎస్ఐ గణేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతురాలు విజయలక్ష్మి

ముష్కరుల పాలిట రక్త'సిందూరం'

కోనేరుసెంటర్: ఉగ్రవాదులపై భారత సైన్యం చేసిన దాడి.. ముష్కరుల పాలిట రక్త సిందూరమైందని మచిలీపట్నం మునిసిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత షేక్‌సిలార్‌దాదా అన్నారు. భారత బలగాలు ఉగ్రవాదులపై చేసిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా పోతేపల్లి జ్యూయలరీ పార్క్‌లో గురువారం జ్యూయలరీ పార్క్ అసోసియేషన్ ఆధ్వర్యాన 'సంఘీభావ ర్యాలీ' నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దెబ్బ తిన్న పులి ఎలా ఉంటుందో భారతదేశం పాక్ ఉగ్రవాదులకు రుచి చూపించిందన్నారు. పహల్గాం దాడి పాక్ ఉగ్రవాదుల పిరికిపంద చర్యగా అభివర్ణించారు. జ్యూయలరీ పార్క్ అధ్యక్షుడు పెద్దేటి సుబ్బారావు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదానికి భారత్ సరైన సమాధానం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో జ్యూయలరీ పార్క్ ఎండీ చలమలశెట్టి ప్రసాదరావు, కార్యదర్శి అంకెం జితేంద్ర కుమార్, మహమ్మద్ రెహమతుల్లాబేగ్, నరహరిశెట్టి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పోతేపల్లి జ్యూయలరీ పార్కులో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ నేతలు, వర్కర్లు

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక భరోసా

పెడన: పట్టణంలో 17వ వార్డుకు చెందిన చేనేత కార్మికురాలు వుమ్మిటి లక్ష్మి కుమార్తె హారిక ఉన్నత చదువు ఫీజు, క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికవ్వడంతో దారి ఖర్చులకు మేమున్నాం స్వచ్ఛంద సంస్థ రూ.35 వేలను మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి చేతుల మీదగా గురువారం అందజేశారు. గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతూ రెండో ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కాలేజీ నిర్వాహకుల ఒత్తిడి, పాటు క్యాంపస్ సెలక్షన్‌లో బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కూడా వచ్చినా వెళ్లలేని పరిస్థితిని 'మేమున్నాం' స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకువచ్చారు. సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ వీణం శ్రీనివాస్ దాతల సహకారంతో ఫీజు, కనీస అవసరాలు బట్టలు, ప్రయాణ దారి ఖర్చులు, బెంగళూరులో వసతి తదితర వాటి కోసం మొత్తం రూ.35 వేలను, రెండు నెలలకు సరిపడా సరుకులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, సాయిబాబు, విజయ్, కిషోర్, పవన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



హారికకు సాయం అందజేస్తున్న ఆర్డీవో స్వాతి

యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

చల్లపల్లి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతి గర్భం దాల్చడానికి కారణమైన వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్.ఐ. పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఒంగోలు మండలం ఆకుల అల్లూరి గ్రామానికి చెందిన యాటకూరి సాయికుమార్ చల్లపల్లి మండలం లక్ష్మీపురం ఉంటున్న తన మేనమామ శివయ్య కుమార్తెకు పెళ్లి మాయమాటలు చెప్పి ఆమెపై అనేకమార్లు అత్యాచారం చేశాడు. చివరికి ఆమె గర్భం ధరించడానికి కారణమయ్యాడు. తీరా పెళ్లి చేసుకోవాలని అడిగితే ఒప్పుకోకపోవడంతో ఈ నెల 7న చల్లపల్లి పీఎస్‌లో బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో సాయికుమార్‌పై కేసు నమోదుచేశారు. విషయం తెలుసుకుని కేసును వాపసు తీసుకోవాలని తన మేనమామను అడిగేందుకు గురువారం లక్ష్మీపురానికి సాయికుమార్ వచ్చాడు. సీఐ సోమేశ్వరరావు తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.